చిత్తూరు జిల్లా వ్యాప్తంగా
219 మంది కానిస్టేబుళ్ల బదిలీ

ప్రజాశక్తి -పుంగనూరు : ఇటీవల పుంగనూరులో టిడిపి కార్యకర్త రామకృష్ణ హత్యా నంతరం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 219 మంది పోలీసులను, పుంగనూరు సర్కిల్ పరిధిలో 32 మంది బదిలీ అయినట్లు ఎస్పి మణికంత చందోలు మంగళవారం పేర్కొన్నారు. పుంగనూరు అర్బన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో భారీగా పోలీస్ కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ స్థాయి బదిలీలు జరగడం ఇది మొట్టమొదటిసారి కావడం గమనార్హం. టిడిపి కార్యకర్త రామకృష్ణ హత్య అనంతరం బదిలీలకు ప్రాధాన్యత చోటుచేసుకుంది. చాలా ఏళ్లుగా పుంగనూరు అర్బన్ సర్కిల్ కార్యాలయ పరిధిలోనే విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుళ్లు బదిలీ కావడం ప్రధానంగా చర్చ నడుస్తోంది.

ఫీజుల పీడ!

- అధిక డబ్బు వసూలు
- ప్రైవేటు పశువైద్య డాక్టర్ల నిర్వాకం
- అందుబాటులో లేని ప్రభుత్వ వైద్యులు
- పాడి రైతుల ఆందోళన

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండల పరిసరాల్లో పాల డెయిరీలు అధికంగా వున్నాయి. దీంతో పాడి పశువులను రైతులు అధికంగా పెంచుతున్నారు. వీటికి ఏదైనా జబ్బులు వస్తే ప్రభుత్వ పశు వైద్యశాలల వద్దకు వెళుతున్నారు. అయితే గ్రామాలకు దూరంగా పశువైద్యశాల వుండడం, సంబంధిత పశు వైద్యులు మధ్యాహ్నం దాటితే తమకు ఫీజు చెల్లించాల్సిందే అని పట్టుపట్టుతుండడంతో విధిలేక తమకు సమీపంలో వున్న ప్రైవేటు పశు వైద్యులను పాడి రైతులు ఆశ్రయిస్తున్నారు. అయితే వారు అనుభవం లేకున్నా అందించే వైద్యానికి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు..దీనికి తోడు లేని జబ్బులు సైతం పశువులకు వున్నట్లు చెప్పి మందులకు, వైద్యానికి అధికంగా డబ్బులు వసూలు చేసి జలగల్లా పీడిస్తున్నారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పశు వైద్యులు తమకు అందుబాటులో వుంది జబ్బులకు గురైన పశువులకు సకాలంలో వైద్యం అందించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ప్రైవేటు డాక్టర్ల నిర్వాకం

గంగవరం మండలం పరిసర ప్రాంతాలలో ఏడు పాల డెయిరీలు వున్నాయి. దీంతో ప్రతి ఇంటికీ రెండు మూడు చొప్పున పాడి ఆవులు పెంచుకుంటున్నారు. సుమారు 2 వేల లోపు పాడి పశువులు వున్నాయి. ఒక్కో ఆవును లక్ష రూపాయల పైనే వెచ్చించి పెంచుతున్నారు. అలాంటి పశువులకు ఏ చిన్న వ్యాధి సోకినా తట్టుకోలేని పరిస్థితి.. దీన్ని ఆసరగా తీసుకుని ప్రైవేటు డాక్టర్లు ఎలాంటి అర్హత లేకుండా, చదువు లేకుండా కొద్దిపాటి అనుభవంతో గ్రామాల రైతుల వద్ద రకరకాలుగా డబ్బులు గుంజుతున్నారు. పశువుకు చిన్నపాటి వ్యాధికే రెండు మూడు రకాల వ్యాధులు సృష్టించి రైతులను భయభ్రాంతులకు గురి చేసి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

అందుబాటులో లేని ప్రభుత్వ వైద్యులు

మధ్యాహ్నం 12 గంటలకే మూతపడ్డ ప్రభుత్వ పశువైద్య కేంద్రం

గంగవరం మండలంలో గంగవరం, కీలపట్ల పెద్ద ఆస్పత్రులు కాగా, పత్తికొండ, గంగ్రాజు పల్లి, గుండిగల్లు, కల్లుపల్లి, మేలుమాయి , దండపల్లి గ్రామాలలో సచివాలయ సిబ్బంది ఉన్నారు. గంగ్రాజు పల్లి పశు వైద్య కేంద్రం పరిధిలో సుమారు 20 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఆస్పత్రి నుండి పలు గ్రామాలకు 7,8 కిలో మీటర్ల దూరంలో అనేక గ్రామాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితులలో లక్షల రూపాయల విలువ చేసే పశువులను ఆస్పత్రికి తరలించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రులలో కేవలం 12 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించి ఆపై అందుబాటులో లేక పోవడంతో సమీప ప్రాంతాల వారు ఈ ప్రైవేట్ డాక్టర్లపైనే ఆధారపడి వలసి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. కొంత మంది ప్రభుత్వ పశు వైద్యులు మధ్యాహ్నం దాటితే వారికి సైతం తప్పని సరిగా నగదు చెల్లించాల్సిందే నని రైతులు పేర్కొంటున్నారు.

అధిక ఫీజుల వసూలు

ఇదే అదునుగా భావించి ప్రైవేటు వైద్యులు ఒక పశువుకు ఒక పశువుకు కృత్రిమ గర్భధారణకు ధర ప్రభుత్వం 40 రూపాయలకు మాత్రమే ఇస్తున్నా ప్రైవేటు వైద్యులు 600 రూపాయలు వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అది సూలు నిలుస్తుందో లేదో గ్యారెంటీ కూడా లేదు.. ఇటీవల కాలంలో పశువులకు గాలికుంటు వ్యాధులు సోకడంతో తూతూ మంత్రంగా ఒకసారి టీకాలు వేశారు తప్ప మళ్లీ గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని తెలిపారు.

ముఖ్యంగా పశువైద్యాధికారులు రైతులకు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండాలి. కొంత మంది అధికారులు పట్టణాలలో కాపురం ఉండి సమయానికి ఆస్పత్రి తెరచి మధ్యాహ్నానికే వెళ్లిపోవడంతో మిగతా సమయంలో ఈ ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడుతున్నామని రైతులంటున్నారు దీంతో పాటు పలుచోట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సైతం కొంత డబ్బు చెల్లిస్తేనే సకాలంలో వైద్యం అందలేదని విమర్శలు కూడా ఉన్నాయి.

పాడి రైతులకు భారం

లక్షల రూపాయల ఖర్చు చేసి పశువులను కొనుక్కొని అవి రోగాల పాలు అయితే కాపాడే నాథుడే లేడని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి మందులు పంపిణీ చేసి సిబ్బందిని సైతం కేటాయించి పాడి రైతులకు అందరూ అందుబాటులో ఉండాలని సూచిస్తున్నా తమకు అందుబాటులో వుండడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. ఎంత మొర పెట్టుకున్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని, పశువులకు వైద్యం భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దూరంలో ప్రభుత్వ పశు వైద్యశాల

మా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ పశు వైద్యశాల ఉంది. అంత దూరం వెళ్లలేక మా పశువులకు ఏదైనా జబ్బు వస్తే ప్రైవేట్ డాక్టరుని ఆశ్రయిస్తున్నాం.. అది కూడా వారి దగ్గరికి కనీసం రెండు మూడు సార్లు తిరుగుతు న్నాం..చాలాసార్లు ఫోన్లు చేస్తే తప్ప రావడం లేదు.. విధిలేని పరిస్థితులలో వారు చెప్పినంత ఇచ్చుకుంటున్నాం..

- సరోజమ్మ, పాడి రైతు.

వైద్యానికి రూ.1300 తీసుకున్నారు..

రెండు నెలల క్రితం మా పశువుకు జబ్బు చేసింది. ప్రైవేట్ డాక్టరు దగ్గరకు వెళ్లాను.. 1300 రూపాయ లు ఖర్చ యింది. అందులో పది రూపాయలు తక్కువ ఇచ్చినా రెండోసారి బతి మాలినా రారని అడిగినంత చెల్లించు కోవాల్సి వచ్చింది. నా ఆవును 60 వేలు ఇచ్చి కొన్నాను. అలాంటి పశువుకు ఏమాత్రం జబ్బు చేసినా నష్టపోతామని వారు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోంది..

- శంకరప్ప, పాడి రైతు.

ప్రభుత్వ డాక్టర్లు డబ్బు అడిగితే చర్య: ఏడీ

ప్రతి సెంటర్ లోనూ సిబ్బంది 12 గంటల వరకు ఉంటున్నారు.. ప్రభుత్వం సరఫరా చేసే మందులలో నాణ్యత లేదని కొంత మంది రైతులు ప్రైవేట్ మందులు వాడుతున్నారు.. అనేక పర్యాయాలు మేము రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాం.. ప్రభుత్వ పశువైద్య సిబ్బంది ఎప్పుడైనా ప్రభుత్వ ఆస్పత్రుల్లో డబ్బులు అడిగితే మాకు వెంటనే సమాచారం అందించండి..వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాం..

- సుజాత, పశు వైద్యశాఖ ఏడీ.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి మణికంత చందోలు

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

రూ.35 లక్షల విలువచేసే బంగారు, వెండి స్వాధీనం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

ఒంటరి మహిళలను, ఆయాలు, తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడు తున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను చిత్తూరు జిల్లా పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకొని వారి నుండి 35 లక్షల రూపాయలు విలువ చేసే 316 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కేజీల 150 గ్రాముల వెండి స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు మంళవారం పోలీస్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి మణికంత చందోలు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు హేమచంద్ర చిత్తూరు, కడప, కావలి, బద్వేలు, కర్నూలు జిల్లాలో 60కి పైగా కేసులున్నాయి. రెండో నిందితుడు సురేష్‌పై సుమారు 27 కేసులు ఉన్నాయి. 1-2 నిందితులపై గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022వ సంవత్సరంలో నమోదు అయ్యాయి. నిందితుడు షైక్ మస్తాన్ పై సుమారు 57 కేసులు ఉన్నాయి. చిత్తూరు జిల్లాతో పాటుగా కడప, కావలి, కర్నూల్, బద్వేల్, ఇతర పోలీస్ స్టేషన్ లలో కూడా వీరి పై పలు కేసు లున్నాయి. ఈనెల 6వ తేది పూతలపట్టు మండ లంలో జరిగిన ద్విచక్ర వాహన దొంగతనం కేసులో బాధితుడి ఫిర్యాదు మేరకు పూతలపట్టు ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎస్‌పి మణికంత చందోలు ఆదేశాలతో చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ టి సాయినాథ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తులో భాగంగా ఈ నెల 17 వ తేదీన అందిన సమాచారం మేరకు పూతలపట్టు మండలం పి కొత్తకోట పాత రోడ్డులో నిందితులను పట్టుకున్నారు. ఒంటరి మహిళ మెడలో బంగారు చైనులు చోరీలు, ద్విచక్రవాహనాల చోరీలు, ఆలయాల్లో చోరి చేసిన బంగారు, వెండి ఆభరణాలను పూతలపట్టు ఎస్ఐ కృష్ణ మోహన్, సిబ్బంది స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండుకు తరలించారు.

డ్రైనేజి అస్తవ్యస్తం

గుడ్డి దీపాల వెలుగులో మురికి వాడలు

న్యూప్రశాంత్ నగర్‌లో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'అస్తవ్యస్తమైన డ్రైనేజి.. గుడ్డి దీపాల వెలుగులో మురికి వాడ లు.. రక్షణ లేని శ్మశాన వాటికలు.. వర్షం వస్తే డ్రైనేజీ నీళ్లు ఇళ్లలోకి ..' ఇలా అనేక సమస్యలు సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో ప్రజా సమస్యలు వెలుగులోకి వస్తున్నా యి.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిం చేందుకు సిపిఎం నేతృత్వంలో ఈనెల 15వ తేది నుండి చిత్తూరు నగరంలో మురికి వాడల్లో సిపిఎం బృందం పర్యటిస్తోంది. ఎక్కడికక్కడ తమ కాలనీల్లోని సమస్యలు సిపిఎం నేతల బృందం దృష్టికి తీసుకొస్తున్నారు.

ముఖ్యంగా ప్రశాంత్ నగర్, ఓటి చెరువు, వీరభద్రకాలనీ, రాజీవ్ నగర్ వంటి ప్రాంతాల్లో అస్తవ్యస్త డ్రైనేజి వ్యవస్థతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్ఈడి పేరిట నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన వెలుతురు లేని వీధి దీపాలతో రాత్రుల్లో వెలుతురు లేక మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో ఎల్ఈడి స్థానంలో కొత్త బల్బులు ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ తీర్మానించినా ఆచరణకు నోచుకోలేదు. నగర మారుమూల ప్రాంతాల్లో చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలు పెరిగి పోతున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో 70కి పైగా మురికివాడలున్నాయి. మురికివాడల్లోని పేదలు, భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, హమాలీలు అధికంగా ఉంటున్నారు. కనీస మౌలిక వసతులకు నోచుకోక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మురికివాడల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు లేకపోవడంతో బిందె నీటిని రూ. 10కి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రశాతం నగర్‌లో 700 ఇళ్లకు రెండు బోర్లులో ఐదు రోజులకో సారి రావడంతో ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యలు తప్పడం లేదు. డ్రైనేజి వ్యవస్థ పూర్తి స్థాయిలో లేకపోవడంతో రోడ్డుపైనే మురికి నీరు పారుతోంది.

ఓటిచెరువు, రాజీవ్ నగర్ కాలనీ, వీరభద్రకాలనీల్లో నీవానది మురునీటి వల్ల ఇక్కడి పేదలకు తరచూ రోగాల భారిన పడుతున్నారు. మంగసముద్రం హౌసింగ్ కానీలోని డపింగ్ యార్డు వల్ల ఇక్కడి ప్రజలు డపింగ్‌యార్డు చెత్తతో దుర్గధం భరించలేక డపింగ్ యార్డును మార్చాలని కోరుతున్నారు. మురికివాడలో అసాంఘిక కార్యక్రమాలతో రాత్రివేళలో మహిళలు ఇంటి నుండి బయటకు వచ్చేందకు భయపడుతున్నారు. వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో మురివాడల ప్రజలు తమ సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తీసుకొస్తున్నారు..

వి కోట : సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండల పరిధిలోని కనుమ నాయన పల్లిలో సిపిఎం నాయకులు మంగళవారం క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భువనేశ్వరి, ఓబుల్ రాజు మాట్లాడుతూ.. వి కోట మండల పరిధిలోని కనమనాయనపల్లిలో దళిత శ్మశాన స్థలాన్ని పెత్తందారులు ఆక్రమించుకున్నారని గ్రామంలో దళితులు మరణిస్తే పూడ్చుకోవడానికి స్థలం కూడా లేకుండా చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేయడం బాధాకరమన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సిపిఎం పోరాడుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఓబులరాజు, భువనేశ్వరి, మండల నాయకులు బాలు, గోపి, అజయ్ , గ్రామస్థులు పాల్గొన్నారు.

పలమనేరు: సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గంటా ఊరు కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వైయస్సార్ కాలనీలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు మాట్లాడుతూ తమ కాలనీలు ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు రోడ్లు, కాలువలు, లైట్లు ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఇల్లు కట్టుకున్న వారు కొన్ని చోట్ల లైట్లు కూడా లేకుండా భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ప్రజలు వీధి లైట్లు లేని కారణంగా ఇళ్ల వద్ద పాములు, తేళ్లు తిరుగుతున్నాయని, ఏ సమయానికి ఏమి ముంచుకొస్తుందో తెలియక కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నామని మహిళలు, మరి కొంతమంది సిపిఎం నాయకుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే కాలనీలలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర, రాజా, జయంతి, శివరామయ్య లక్ష్మయ్య, రత్నమ్మ, ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితా తయారీ: డిఆర్‌వో

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోందని జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివా లయం లోని డిఆర్ఓ సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డి ఆర్ఓ మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్ఓ లు, ఏఆర్ఓ లు, బిఎల్ఓ లు చర్యలు చేపడుతున్నారని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎపిక్ కార్డులను ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమ నిబంధనలు, చట్టాలలో అవసరమైన మార్పు చేర్పులు చేపట్టడానికి రాజకీయ పార్టీల నుండి సూచనలు స్వీకరిస్తామన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని, మరణించిన వారి ఓటును కుటుంబ సభ్యులకు నోటీసు అందించి తొలగిస్తున్నా మన్నారు. ఒక ఓటరు రెండు నియోజకవర్గాలలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తిస్తే బిఎల్ఓల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఫారం 6, 7, 8 కింద 8,268 దరఖాస్తులు అందగా 4,933 దరఖాస్తులు పరిష్కరించామని, మిగిలినవి త్వరలో పరిష్కరి స్తామన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, పలమనేరు, నగరి కుప్పం ఆర్డీవోలు శ్రీనివాసులు, భవాని, భవాని శంకరి, శ్రీనివాసులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి ప్రతినిధి వి సురేంద్ర కుమార్, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, ఎసిపి ఎన్ ఉదయ్ కుమార్, జనసేన ప్రతినిధి దేవినేని యశ్వంత్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి బి లోకనాథం, సీపీఎం తరపున వి గంగరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చనిపోయిన వారిని లిస్టు నుండి తొలగించాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

చిత్తూరు అర్బన్: చనిపోయిన వారి పేర్లను ఎన్నికల జాబితా నుండి తొలగించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో డిఆర్ఓ ఓటర్ల జాబితాపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 20వేల మంది చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని పదేపదే చెబుతున్నా తొలగించక పోవడం సరి కాదన్నారు. పక్క నియోజకవర్గాల్లో ఒకే చోట ఉన్న ఓటర్లు మరోచోట ఉంటున్నారని దీని వల్ల దొంగ ఓట్లకు ఆస్కారం వుందని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఫొటోలు పురుషులు వున్న చోట స్త్రీలు, స్త్రీలు వున్న చోట పురుషులుగా ఉన్నాయని వాటిని సరిచేయాలన్నారు. ఓటర్ల జాబితాకు ఆధార్ కార్డు అనుసంధానం సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం చేయాలని సిపిఎం తరపున రాత పూర్వకంగా అందించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌వో సుధారాణి

పకడ్బందీగా నిర్వహించాలి

'మాతాశిశు సంరక్షణ' సమీక్షా సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

మాతా శిశు సంరక్షణ పకడ్బందీగా నిర్వహించాలని డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణీ మొదలుకొని మనం ఇచ్చే ప్రతి సేవ కచ్చితంగా ఉండాలి, వెయ్యి రోజులపాటు వారిపై నిఘా ఉంచి ప్రతి సేవ ఎప్పటికప్పుడు అందించాలని, తద్వారా మాత శిశు మరణాలు లేని సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. సమాజంలో ఆరోగ్యానికి మొదటి సూచిక మాత శిశు మరణాలు లేని సమాజం మాత్రమే అన్నారు. ఆ దిశగా మనమిచ్చే ప్రతి సర్వీసు ఆశాలు, ఏఎన్ఎంలు ,ఎం.ఎల్ హెచ్ పి ల ద్వారా సేవలను మానిటర్ చేస్తూ ఎప్పటికప్పుడు అందిస్తే ఆరోగ్య సమాజం తథ్యం అన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 100 శాతం అందించేటట్లు ప్రతి ఒక్కరూ బాధ్యతతో నిర్వహించాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో కొత్త క్యాన్సర్ కేసులను కనుగొనడానికి ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరిని కచ్చితంగా చెక్ చేసి యాప్‌లో నమోదు చేసి అవగాహన కల్పించాలి. వ్యాధులపై నిఘా ఉంచి ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆశాలు ప్రతిరోజూ తప్పకుండా యాప్‌ను లాగిన్ చేయాలి. అర్హులైన దంపతుల అప్‌డేషన్ కొత్తగా నమోదయ్యే ప్రెగ్నెన్సీస్ నమోదు, కాన్పు అయిన తర్వాత హెచ్బిఎన్సి సేవలు, హెచ్ బి వై సి సేవలు, ఐరన్ సిరప్ పంపిణీ తప్పక అప్డేట్ చేయాలి. పిహెచ్‌సి పరిధిలో చేసే ప్రతి ఆరోగ్యకర కార్యక్రమాన్ని నోడల్ అధికారులు మానిటర్ చేస్తే మంచి ఫలితాలు అందించ వచ్చున్నారు. అన్ని రకాల యాప్‌లలో ఏ రోజుకు ఆ రోజు పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. ఇలా అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్ని పర్యవేక్షించి జిల్లాను అగ్రగామిగా వుంచాలని సూచించారు. అన్ని పనులు సకాలంలో పకడ్బందీగా చేపట్టి మాతా శిశు సంరక్షణకు అందరూ సమిష్టి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ డి యం హెచ్ ఓ డాక్టర్ వెంకటప్రసాద్ , డి ఐ ఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రవీణ , రామ్మోహన్, మూర్తి ఆశ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విజయోత్సవ వేడుకలు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని డాక్టర్ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రాంగణ నియామకాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రఖ్యాతి గాంచిన ఎమ్మెల్సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, నిర్వహించిన ఎంపికలలో మొత్తం 122 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. వీరందరికీ ఆయా పరిశ్రమలు 2 లక్షల నుండి 8 లక్షల వరకు వార్షిక వేతనాన్ని చెల్లించడానికి అంగీకరించారన్నారు. అయితే ఇసిఇ విభాగానికి చెందిన విద్యార్థిని వి తేజశ్రీ బెంగళూరు నగరానికి చెందిన ఒక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ పరిశ్రమలో 9.02 లక్షల వేతనానికి అర్హత సాధించినట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు అధికమంది ఉద్యోగులుగా ఎంపిక అయిన సందర్భంగా ఆచివర్స్ డే వేడుకలను నిర్వహించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారందరికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగులుగా నియామకులైన విద్యార్థులకు నియామక పత్రాలను వారి తల్లిదండ్రుల చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

రీ సర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దపంజాణి:మండలంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను విజయవాడ సర్వేర్ నోడల్ ఆఫీసర్ నాగేశ్వరరావు మంగళవారం పరిశీలిం చారు. మండలంలోని చల మంగళం రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి రీ సర్వే పనులను నిర్వహి స్తున్నారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ రీ సర్వే పనులను చేస్తున్నప్పుడు సంబంధిత రైతులకు తెలిపి వివాదాలకు తావు లేకుండా పూర్తి చేయాలని మండల తహశీల్దారు సి ఎస్ అనిల్ కుమార్ కు సూచించారు. అనంతరం సర్వే ఎంతవరకు నిర్వహించారు? ఎంత పూర్తి కావాల్సి వుంది?' అని అనే వివరాలను అడిగి తెలుసుకుని, సర్వే చేసిన హద్దులను పరిశీలించి భూ వివాదాలకు తావు లేకుండా రీ సర్వే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల రిసర్వేర్ డిటి రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ కుమార్, మండల సర్వేయర్ సైరాజ్ నాయక్, గ్రామ సర్వేయర్ సోమశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారి సచివాలయం సర్వేలు రోజా రమణి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వే సనులు పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ నాగేశ్వరరావు

తహశీల్దారుతో సమీక్షిస్తున్న పలమనేరు ఆర్‌డివో భవాని

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దారుకు ఆర్‌డీవో ఆదేశం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పెండింగ్‌లో వున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని పలమనేరు ఆర్డిఓ భవాని తహశీల్దారును ఆదేశించారు. మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను 42 పరిష్కారం కాకుండా ఉన్నాయని వాటికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని తగిన నివేదికలను త్వరగా పూర్తిచేసి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ , ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ పాల్గొన్నారు.

వెదురుకుప్పంవాసి హైదరాబాదులో ఆత్మహత్య

- స్వగ్రామానికి చేరడం ఆలస్యం
- మృతదేహాన్ని దాచిపెట్టారని బంధువుల నిరసన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని కొమర గుంట గ్రామానికి చెందిన ఉద్యోగి మహేష్ (29) కుటుంబ కలహాలతో హైదరాబాదులో తను నివాస ముంటున్న రూములో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ పోలీసులు బంధువు లకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిం చారు. మంగళవారం మృతదేహం స్వగ్రా మానికి రావడం ఆలస్యం కావడంతో బంధువులు రోడ్డు పైకి ఎక్కి 'మృతదేహాన్ని దాచిపెట్టారని బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు.. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని కొమరగుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి కి ఇద్దరు మగసంతానం, ఒకరు లోకేష్ , మరొకరు మహేష్ (29) ఇతను పక్క గ్రామమైన దామర కుప్పంలో ఓ మహిళతో కుటుంబం సమక్షంలో సుమారు రెండు సంవత్స రాల క్రితం వివాహం చేసుకున్నాడు. మహేష్ తల్లి చిన్నతనంలోనే మరణించింది. ఉద్యోగరీత్యా మహేష్ భార్యతో కలిసి హైదరాబాదు లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో మనస్థాపంతో సోమవారం తన నివాస మున్న రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి పోలీసులు చెప్పినట్లు బంధువులు మీడియాకు తెలిపారు.

రోడ్డుపై బంధువుల ధర్నా

మహేష్ మృతదేహాన్ని సోమవారం హైదరాబాదులో పోస్టుమార్టం నిర్వహించడంతో మంగళవారం కూడా స్వగ్రామానికి చేరుకోక పోవడంతో మృతిని భార్యపై అనుమానంతో మృతుడి బంధువులు రోడ్డుపై ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న కార్వేటినగరం సిఐ హనుమంతప్ప తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులకు సర్ది చెప్పి ఆందోళన విరమించారు. మధ్యాహ్నం మహేష్ మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. అంత్యక్రి యలు నిర్వహించారు. గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. వివాహమై రెండు ఏళ్లకే ఇలా జరగడం బాధాకరమని బంధువులు చెబుతు న్నారు. వృద్ధుడైన తండ్రి అతనిపైనే అన్ని ఆశలు పెట్టుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అతడి మృతికి భార్యపై అనుమానం ఉన్నట్లు బంధువులు పేర్కొంటున్నారు.

రోడ్డుపై బంధువుల ధర్నా (ఇన్‌సెట్‌లో ఆత్మకు పాల్పడిన మహేష్)

వీధి దీపాల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- తవణంపల్లి:

ప్రజాశక్తి తవణంపల్లి అరగొండ గ్రామ మేజర్ పంచాయతీ లో వీధి దీపాల సమస్యకు వినూత్న పరిష్కారం చేపట్టారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ మల్లు దొరై, పంచాయతీ ఈవో మురగేషన్, ప్రజా పరిష్కార దిశగా విద్యుత్ దీపాల సమస్యను ఈఓ నెంబర్ 9441492660 కి ఫోన్ చేసి సమస్య తెలిపిన 48 గంటలల్లోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు వరకు ఫోన్ చేయొచ్చని ప్రశాంత్ కుమార్ సామాజిక మాధ్యమాల రూపంలో అరగొండ గ్రామపంచాయతీ ప్రజలకు తలిపారు.

వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శిల సంఘం నాయకులు

పని ఒత్తిడి తగ్గించండి..

పంచాయతీ కార్యదర్శిల వినతి

ప్రజాశక్తి -విజయపురం:

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమ లు చేసే ప్రక్రి యతో పా టు పంచా యతీ పరిపా లనలో కార్య దర్శులు పాత్ర కీలక మైందని, దీని వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురై అనారోగ్యంతో పాటు కుటుంబానికి దూరమయే పరిస్థితులు నెలకొన్నాయని, తమపై పనిభారం (ఒత్తిడి) తగ్గించాలని స్థానిక ఎంపిడివో ఎన్ కృష్ణయ్యకు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం మంగళవారం వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లా డుతూ పంచాయతీ రాజ్ శాఖ కి సంబంధించిన పరిపాలన, శాఖా పరమైన పనులతోపాటు సచివాలయం నిర్వహణ, సర్వేల నిర్వహణ భారంగా ఉన్నాయని, వెంటనే పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, నిషా, సునీత, పురుషోత్తం పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నులిపురుగుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:

నులిపురుగుల నివారణపై అవగాహన అవసరమని ఆర్‌బిఎస్ కే జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గిరి అన్నారు. మంగళవారం ఆయన విజయం స్కూలు, ఎల్లమరాజు పల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి నులిపురుగుల నివారణ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని విద్యార్థు లకు పిలుపు నిచ్చారు. విద్యార్థి దశలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్తులో ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ స్వామి దాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇది సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమణపై కేసు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం ముందు అఖిలాండం మెట్ల వద్ద భారతీయ చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 118 మంది వరకు తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించిన హెూటల్ ముంతాజ్‌కు కేటాయించిన జీ.వో.ను రద్దు చేయాలని, పవిత్రత కాపాడాలని అంశాలపై ఆందోళనకు దిగిన విషయం విదితమే. బోడె రామచంద్ర తో పాటు 117 మందిపై కేసులు నమోదు చేశారు. శ్రీవారికి వినతిపత్రం ఇవ్వడానికి వచ్చినట్లు చెప్పి ఆందోళన చేయడానికి సిద్ధమైనట్టు పోలీసులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కల్గిస్తారని సమాచారంతో జాగ్రత్త చర్యగా వారిని అదుపులోకి తీసు కొని (ప్రివెంటివ్ అరెస్ట్) చేసి బెయిలు పై రిలీజ్ చేశామని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

శతపథికి శ్రీభాష్యం రాష్ట్రీయ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతికి మాజీ ఉపకులపతిగా సేవలందించిన ప్రముఖ సంస్కృత పండితులు ప్రొఫెసర్ హరే కృష్ణ శతపథికి శ్రీభాష్యం పార్థసారథి రాష్ట్రీయ అవార్డు ప్రదానం చేశారు. సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి, అకడమిక్ పరిపాలనలో విశేష సేవలు అందించినందుకు ఆయన ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం భువనేశ్వర్‌లోని ఐఐటిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కళింగా ఇన్‌స్టిట్యూట్‌కు సోషల్ సైన్సెస్‌కు సలహాదారుగా ఉన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ సంస్కృత సలహా మండలి ఛైర్మన్‌గానూ సేవలందిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత అకాడమీ, సర్వ వైదిక సంస్థన్ సంయుక్త నిర్వహణలో ఈ అవార్డు ప్రదానం చేవారు.

బాలిరెడ్డిపాళెం పిహెచ్‌సిలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి - తిరుపతి

స్విమ్స్ ఆధ్వర్యంలో బాలిరెడ్డిపాళెం పిహెచ్‌సిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌ను వైద్యాధికారి డాక్టర్ బి.రంగదీప్తి ప్రారంభించారు. కొండాపురంలో మహిళలకు మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్సుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా మంగళవారం కొండాపురం గ్రామ సచివాలయంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బాలిరెడ్డిపాళెం పిహెచ్ సిలో మార్చి 20న జెకె.పాళెం, కొండూరు, మార్చి 21న కల్లూరు, నెల్లిపూడి, మార్చి 24న వాకాడు-1, వాకాడు-2లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే చిల్లకూరులోనూ ప రీక్షలు జరిగాయి. చిల్లకూరు వైద్యాధికారి డాక్టర్ షాలోమ్ అరాఫత్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి బహిర్గతం

సామాజిక తనిఖీ బహిరంగ సభలో రూ.87,085 వేల రికవరీ

ప్రజాశక్తి -సోమల: మండల మండల కేంద్రమైన సోమల శ్రీ శక్తి భవన్ సమీపంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో అధికారులు 15 పంచాయతీల పరిధిలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులలో జరిగిన అవినీతికి సంబంధించి 87,085 రూపాయలను రికవరీ చేయించాలని ఆదేశించారు. 1-4-2023 నుండి31-3-2024 సంవత్సరానికి సంబంధించి 13.89 కోట్ల రూపాయలను 15 పంచాయతీలలో 2,273 పనుల కోసం ఖర్చు చేయగా అందులో పలుచోట్ల సోషల్ ఆడిట్ టీం పరిశీలనలో కొన్ని పనులు చేసినట్లు రుజువు కాకపోవడంతో డ్వామా పీడీ రవికుమార్ రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. ఉపాధి హామీ పంచాయతీ రాజ్ ,ఆర్‌డబ్ల్యూఎస్ ఇరిగేషన్, హౌసింగ్, సర్వ శిక్ష అభియాన్ శాఖల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఏపీవో దినకర్ బాబు సభకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిఓ శివయ్య, ఏవో జయప్రకాష్, పలుశాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ బహిరంగ సబలో పాల్గొన్న అధికారులు

రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్న ఏడీఏ శంకర్‌రెడ్డి

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి: ఏడీఏ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రైతులు ఆర్ ఎస్ కె లో నమోదు చేసుకోవాలి ఏడిఏ శంకర్ రెడ్డి అన్నారు మంగళవారం మండలంలోని పాలేరు సచివాలయంలో 'పొలం పిలుస్తోంది..' కార్యక్రమం వ్యవసాయ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో మెలకువలు పాటించాలని వరిలో కాండం తొలిచూ పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని రైతులందరూ తప్పకుండా పీఎం కిసాన్ నందు ఈ కే వైసీ చేసుకోవాలని భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు సేవ కేంద్రం నందు నమోద చేసుకోవాలని అన్నారు ప్రకృతి వ్యవసాయం గురించి అంబికా గాంధీ వివరించారు అన్ని రకాల కషాయాలు వాటిని ఉపయోగించే విధానం గురించి తెలిపారు ఈ కార్యక్రమంలో విస్తరణాధికారులు సాదరయ్య చంద్రిక పలువురు రైతులు పాల్గొన్నారు

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - రేణిగుంట:

ఈనెల 20న తిరుమల, తిరుపతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారని తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నందు జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాథన్‌తో కలసి భద్రత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా ఎలాంటి చిన్న పొరపాట్లు కు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 20 న గురువారం రాత్రి 9.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన తిరుమల శ్రీపద్మావతి అతిథి గృహం చేరుకుంటారని తెలిపారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని అనంతరం తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు తిరుమల నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ వారు ప్రత్యేక డాక్టర్లు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఏర్పాట్లు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో ఏఎస్పీ లు రవిమనోహరాచారి, బి.నాగభూషన్ రావ్, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, , జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్పోర్ట్ అధికారులు, తహశీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం, వేరుశనగ పంటపై శిక్షణ

ప్రజాశక్తి- తవణంపల్లి: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్, ఆయిల్ సీడ్ పథకం కింద చెర్లోపల్లి లోని 30 మంది ఎస్‌సి రైతులకు మంగళవారం శిక్షణ నిర్వహిం చారు. ఈ సందర్భంగా చిత్తూరు ఏరు వాక శాస్త్రవేత్త సంధ్యారాణి మాట్లాడుతూ వేరుశనగలో మేలైన, వివిధ రకాల రోగాలను తట్టుకొనే కొత్త రకాల గురించి వివరించారు. వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించడానికి చేపట్టాల్సిన విత్తనం ఎంపిక నుండి పంట కోత వరకు చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు , సమగ్ర ఎరువుల యాజ మాన్యం, సమగ్ర పురుగుల యాజమాన్యం ,యాంత్రీకరణ, కలుపు నివా రణ గురించి రైతులకు వివరిం చారు. నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి చేపట్టాల్సిన విత్తన శుద్ధి, మొక్కల సాంద్రత , పూత సమయాల్లో జిప్సం వాడకం వల్ల కలిగే ఉపయోగాలు, పంట చుట్టూ జొన్న, మొక్క జొన్న పంటల వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.

మాట్లాడుతున్న చిత్తూరు ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మునిరాజులు

ప్రజాశక్తి-పలమనేరు:



పలమనేరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మునిరాజులు నియమితు లయ్యారు. మంగళవారం పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆయనకు నియామక పత్రం అందించారు. న్యాయవాది మూడు సంవత్సరాలు ఇప్పటినుండి స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తారు. మున్సిపల్ శాఖ కు సంబంధించిన కేసులన్నీ పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి, పలమనేరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి రావడానికి కృషి చేసిన సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తన వంతు మంచి సేవలు అందిస్తా నని తెలిపారు. పలమనేరు న్యాయవా దులు ఆయనకు ఈ పదవి రావడంతో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలం నుంచి గ్రామస్తుల సమస్యలపై కలెక్టర్ కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలపై తహశీల్దారు లోకనాథ పిళ్లై ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం మధ్యాహ్నం చిలమాకుల పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలం కొలిచి హద్దులు నిర్ణయించే పరిష్కారంపై గ్రామస్తులతో మాట్లాడి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. పొదలపల్లి ప్రాథమిక పాఠశాలలో గతంలో పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో చొరబాట్లు ఉండడం దీనిపై గతంలో రెండు మూడుసార్లు గ్రామంలో గొడవలు, ఘర్షణ పెరగడంతో దీనిపై దృష్టి సారించి గ్రామంలోకి వెళ్లి పాఠశాలకు స్థలాన్ని పరిశీలించారు. పి వి పురం గ్రామం దళిత వాడ శ్మశానానికి రోడ్డు విషయం పరిశీలించారు. కృష్ణాపురం జలాశయం నుంచి వచ్చే కాలువలో శ్మశాన వాటికకు వెళ్లాల్సి ఉంటే ఆ కాలువలో నీరు ఉండటం వల్ల వెళ్లని దుస్థితి ఏర్పడింది. కృష్ణాపురం జలాశయం కాలువ పక్కనే ఉన్న కాలవ మీదుగా దారి కావాలని గ్రామస్తులు కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడంతో తహశీల్దారు లోకనాథ పిళ్లై కాలువను పరిశీలించి ఆ కాలవ కొంత దూరం మాత్రమే ఉండడంతో దీనిపై గ్రామస్తులే మాట్లాడి దారి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. శ్మశానానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. అన్ని గ్రామాల్లో రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న ఆధారంగా గొడవలు లేకుండా పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

శ్రీసిటీలో నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

భారతదేశ పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజ్ (ఎన్ డి సి) కు చెందిన 17 మంది సభ్యుల ప్రతినిధి బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. మేజర్ జనరల్ సి.పి.సంగ్రా, ఏ వి ఎస్ ఎం వై ఎస్ ఎం (రిటైర్డ్) నేతత్వంలో భారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో సహా విచ్చేసిన బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఏకీకత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ లాజిస్టిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో భాగస్వామ్యం గురించి ఆయన వారికి వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు కోల్గేట్, పెప్సీ పరిశ్రమలను వారు సందర్శించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా శ్రీసిటీలో కొనసాగుతున్న అభివద్ధి పనులను శ్లాఘిస్తూ, ఇక్కడ క్రమశిక్షణ అద్భుతమంటూ టీమ్ లీడర్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పర్యటన కోఆర్డినేటర్‌లుగా ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివద్ధి సంస్థ (ఏ పి హెచ్ ఆర్ డి ఐ) డైరెక్టర్ జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏపీఎన్జీజీవో సంఘం సహకారంతో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి ద్వారా స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల తో పాటు ప్రజలు వైద్య పరీక్షలు చేసుకున్నారు. శిబిరంలో 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 60 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయగా, ఎంపిక చేసిన వారందరినీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి తిరుపతి ఆస్పత్రికి పంపి, వారికి భోజన వసతులు ఏర్పాటు చేయడంతో పాటు చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి పలమనేరులో బస్సులో పూర్తి ఉచితంగా చేర్చడం పిపిఎస్ అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్లై, గౌరవాధ్యక్షులు ఆనందబాబు, కార్యదర్శి నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ వైద్యులతో పాటు పిపిఎస్ సభ్యులు శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్ రెడ్డి, రాఘవయ్య, దొరస్వామి, దేవరాజులు, పొన్ముడి, నాగప్ప, జగన్నాథం, సన్నిరాజు, సాంబయ్య, రామచంద్ర, సామరాజు, రెడ్డెప్ప నాయుడు, దవణముని, విజయకుమార్, సయ్యద్ నిసార్, నారాయణ, పెన్షనర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురురాజారావు, రత్నారెడ్డి, గౌస్ బాషా, గోవిందయ్య శిబిరం ఏర్పాట్లు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

మాధవిలతకు డాక్టరేట్

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని బంధార్లపల్లి గ్రామానికి చెందిన మాధవి లతకు ఎస్వి యూనిర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఇన్‌ఛార్జి డాక్టర్ సరోజమ్మ ఆధ్వర్యంలో మాధవిలత అనాలసిస్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ పై పరిశోధన చేశారు. దీంతో ఆమెకు యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందించారు.



మాట్లాడుతున్న తహశీల్దారు సిఎస్ అనిల్‌కుమార్

ఈకేవైసీ తప్పనిసరి: తహశీల్దారు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రేషన్ కార్డులోని సభ్యులందరూ ఈ కేవైసీ చేయాలని స్థానిక తహశీల్దార్ సిఎస్అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి ఈ కేవైసీ చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కేవైసీ చేయని సభ్యులకు ఉచిత బియ్యం అలాట్మెంట్ కాదని అందువల్ల ప్రతి ఒకరికి ఈనెల 24వ తేదీ లోపు ఈ కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి డీలర్ విధిగా రోజువారి ఎండియుకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువులను వారి స్టాక్ రిపోర్ట్ లో నమోదు చేసుకోవాలని తద్వారా స్టాక్ వ్యత్యాసాలు తెలుస్తాయని తెలిపారు. ఆథరైజేషన్ కలిగిన డీలర్లు అందరూ ఆథరైజేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఒక సెట్ జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందించాలని సూచించారు. ప్రతి నెలా రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి బియ్యం అందించాలన్నారు. ఎండియు వాహనాలు లేనిచోట తప్పని సరిగా వీఆర్ఏ లాగిన్‌లో డీలర్ పంపిణీ చేయాలని తెలిపారు. డీలర్లు అందరూ కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆర్ఐ రాకేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శివకుమార్, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి

మోహన్ సాయికి సాయమందించాలని వినతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అమెరికాలోని మెమ్ఫిస్ కాల్పుల ఘటనలో తీవ్ర గాయాలకు గురైన ఏర్పేడు మండలం గోవిందవరం గ్రామానికి చెందిన మోహన్ సాయికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సాయాన్ని అందివ్వాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. బొజ్జల మంగళవారం లోకేష్ ను కలిసి మోహన్ సాయి పరిస్థితిపై నివేదిక ఇచ్చారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండేలా ప్రభుత్వం నుంచి అధికారిక హామీ కావాలని కోరారు. స్పందించిన మంత్రి తప్పకుండా మోహన్ సాయిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తిరుపతిలో 'లూలు' మాల్స్..!

వెయ్యి మందికి పైగా ఉపాధి..
ప్రభుత్వ స్థలం 30 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి సిటీలో లూలు మాల్స్ రాబోతుంది.. 30 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసే ఈ మాల్స్‌లో వెయ్యి మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించనుంది. తిరుపతి శివారులో ప్రభుత్వ భూమిని కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇప్పటికే జారీ చేశారు..

తిరుపతి నగరంలో ఇప్పటికే డి మార్ట్, రిలయన్స్ మార్ట్‌లు ఉన్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలో లూలు మాల్స్ ఏర్పాటు చేయాలని ఏపీ క్యాబినెట్ నిర్ణయించింది.. మొదట విశాఖపట్నం రెండో దశలో తిరుపతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.. తిరుపతి శివారు ప్రాంతం అయిన పేరూరు దగ్గర లూలు మాల్స్ ఏర్పాటు చేయబోతున్నారు.. షాపింగ్ మాల్స్, ఐమాక్స్ థియేటర్లు తదితర అధునాతన సౌకర్యాలతో లూలు మాల్స్ ఏర్పాటు చేయబోతున్నాయి.. వెయ్యి మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా లూలు మాల్స్ ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. రిలయన్స్ మార్ట్, డీ మార్ట్ కన్నా రేట్లు తక్కువ నాణ్యత కలిగిన ఎలక్ట్రానిక్ వస్తువులు, నిత్యవసర సరుకులు, బట్టలు తదితర సౌకర్యాలతో తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులో ఉండేలా లూలు మార్క్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.. 30 సంవత్సరాల అగ్రిమెంట్ తో ప్రభుత్వానికి లూలు సంస్థలకు మధ్య ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది.. విశాలమైన కారు పార్కింగ్, బహుళ అంతస్తుల మేడలతో లూలు మాల్స్ ఉండబోతుంది.. వచ్చే మార్చి నాటికి పనులు ప్రారంభించుకోనున్నారు.. 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వానికి లూలు మాల్స్ ఒప్పందం కుదిరింది.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో విశాఖపట్నంలో లూలు మాల్స్ ఇచ్చిన భూములు కూడా ఆ ప్రభుత్వం తీసేసుకుంది. ఇప్పుడు మళ్లీ విశాఖపట్నం, తిరుపతి,అమరావతిలో లూలు మాల్స్ ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో లూలు మాల్స్ బ్రాంచ్ లు ఎన్నో ఉన్నాయి.

IN THE COURT OF XIITH ADDITIONAL DISTRICT JUDGE::SRIKALAHASTI
A.S.No.180/2023
Between
Ponnepalli Chayapathi ...Appellant
and
Mattam Kiran Kumar,
Mattam Sandeep
A.Vani ...Respondents No. 1,2,4
Appeal Notices to Respondents No.1,2,4
ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా పై దావానందు Appellant మీమీద సదరు Appeal దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావానందు మీరు Respondents No.1,2,4 గా దాఖలుచేసియున్నాడు. సదరు దావా పై కోర్టునందు 21.03.2025 వాయిదా వున్నది కావున ఆ దినం మీరు ఉదయం 10-30 గం॥లకు మీరుగానీ మీ వకీలు ద్వారా గానీ హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలిజయజేసుకోవలెయును. అట్లు హాజరు కానియెడల సదరు Appeal దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
యం.విజయ్ శేఖర్,
అడ్వకేట్, శ్రీకాళహస్తి.